కలంపోటు

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

౧

ఢాం ఢాం ఢుకారా మంటూ నగారా మోత వినపడేటప్పటికి కృష్ణరాయడు కొలువు చాలించి అభ్యంతరమందిరం లోకి వేంచేశాడు. కట్టతెగిన చెరువు నీటిలాగ సభ్యులు అన్ని ద్వారాలనుంచీ బయటికి వచ్చి అక్కడక్కడ నిలిచి కొందరూ, నింపాదిగా నడుస్తూ కొందరూ కొంచెంవడిగా వెళ్లిపోతూనే తారసపడినవారిని పలకరిస్తూనూ పలకరించినవారికి జవాబు చెబుతూనూ కొందరూ, ఎవరికోసమో కనిపెట్టుకుని కొందరూ భువనవిజయం ఆవరణఅంతా నిండివున్నారు. దూరాన పొగడచెట్టుక్రింద, శిష్యుడితో మాట్టాడుతూ నంది తిమ్మకవి నుంచునివున్నాడు.

శిష్యుడు—ఖండిత నాయికా, దక్షిణ నాయకుడూ, ఆపైని నారదమహర్షి - ఎంత కల్పనకేనా అవకాశం వుందనీ, తమరు దాన్ని పూర్తిగానే వినియోగ పరుచుకుంటారనీ-(అర్థోక్తి)

తిమ్మకవి—ఎవరి మాట అది ?

శిష్యుడు—ధూర్జటికవిగారిదండి. దాని మీద పెద్దయ్యంగా రందుకున్నారండి.

తిమ్మకవి—(ఆత్రంగా) వారేమన్నారూ?

శిష్యుడు — "తిమ్మకవిగారి సత్యభామ ఆంధ్రవాఙ్మయాని కొక విశిష్టత కూరుస్తుం దనీ—(అర్థోక్తి)

తిమ్మకవి—(చెయ్యి జాడిస్తూ) సెబాస్! మహామంచిమాట విన్నాను.........రచనలో కొత్తదారి తొక్కినవారు వారు. ఈ విషయం గ్రహించడానికి వారికే అర్హత వుంది.

శిష్యుడు —- తరవాత, వారు, నన్ను చూసి "మంచి గ్రామం యెక్కడుందో మీ గురువుగా రిప్పణ్ణుంచీ దర్యాప్తు చేసుకోవచ్చునోయీ" అన్నారండి.

తిమ్మకవి—బాగుంది.

శిష్యుడు—"తిమ్మకవిగారి పోకడలు బాగా గమనిస్తూ వుండం"డని తమ శిష్యులకు కూడా సెల విచ్చారండి వారు.

తిమ్మకవి—-(ఆనందంతో తలవూపుతూ) అలాగేం ?.........ఏమన్నా అనే వారే వారు. పారిజాతాపహరణం యిక ఆచంద్ర తారార్కంగా వుండిపోతుంది. ఏమీ సందేహం లేదు.

శిష్యుడు—కాని—(అర్థోక్తి)

తిమ్మకవి—(ఉలిక్కిపడి) కానీ అంటే?

శిష్యుడు—అంతలో మహామంత్రి తిమ్మరుసయ్యంగారు కలుసుకున్నారండి.

తిమ్మకవి—వారితోకూడా యీప్రస్తావన జరిగిందా?

శిష్యుడు—జరిగిందండి. పెద్దయ్యంగారే నడిపారు.

తిమ్మకవి—ఎలాగా?

శిష్యుడు—"అంతఃపురంలో తిరుమల దేవమ్మగారి కెలాంటి పదవి వుందో, కవి మండలిలో తిమ్మకవిగారి కలాంటి-(అర్థోక్తి)

తిమ్మకవి—(చిటికవేస్తూ) అది గదీ మాట. కోట్లు విలవఅయినమాట అది. నేను తిరుమలదేవమ్మగారితో వచ్చిన అరణపుకవిని కనకనున్నా, వొక కావ్యం అంకితంకూడా చేస్తున్నాను కాబట్టిన్నీ ప్రభువువారు నాకొక అగ్రహారం మెలాగా దయచేస్తారు. అయితే పెద్దయ్యంగారిమాట నా కంతకంటే పెద్ద సత్కారం అనిపించుకుంటుంది.

శిష్యుడు—కాని మహామంత్రులవారు-(అర్థోక్తి)

తిమ్మకవి—(ఆదుర్దాగా) వారేం సెలవిచ్చారూ?

శిష్యుడు—సావధానంగా నుంచుని, చిరునవ్వు నవ్వుతూ—(అర్థోక్తి)

తిమ్మకవి—వారిమెప్పుపొందడం మాటల్లోది కాదు. అసలు, ఓపట్టాన, వారు పైకి తేలనేతేలరు.

శిష్యుడు—ఇప్పు డలాగే జరిగిందండి.

తిమ్మకవి—ఏం జరిగింది?

శిష్యుడు—మహాకవులరచనలలోవుండే మెళుకువలు చక్కగా కనిపెట్టే మహామంత్రులవారు అలా మెందు కన్నారోగాని—(అర్థోక్తి)

తిమ్మకవి—(కంగారుఅదిమిపెట్టుకుంటూ) ఏమన్నారురా?

శిష్యుడు—"తిమ్మకవిగారు చాలాగొప్పవారే. నిజంగా, వారు వశ్యవాక్కులే. కాని-(అర్థోక్తి)

తిమ్మకవి—(ముంగోపంతో) ఏం కానీ? నలిపినలిపి చంపుతా వేమిట్రా?

శిష్యుడు—"కాని నే నిప్పుడొక రాచకార్యంలోపడి కొట్టుకుంటున్నాను. ఎన్నివిధాల బుర్రచించుకున్నా దారీ తెన్నూ కనపడ్డంలేదు. ఈస్థితిలో భాషావిషయం; అందులోనూ శృంగారకవిత్వం — అసలు కవిత్వం అంటేనే నాతల కెక్కదు లెండి" అన్నా రండి వారు.

తిమ్మకవి—(కొంచెం నిరుత్సాహపడి) ఏమిటీ? మహామంత్రులవారి మాటలాయివి?

శిష్యుడు—అవునండి. ఒక్క అక్షరమే నా విడిచిపెట్టలేదండి నేను. పెంపకంకూడా చెయ్యలేదండి.

తిమ్మకవి—(ఆలోచిస్తూ) ఈ మాటల కర్థ మేమిటీ? ఎన్ని తొందరపను లున్నా వారి బుద్ధి ఆరాటం మెరగదే? దానికి చల

నం అంటూ లేదే? పైగా యిది భాషావిషయమా? అసలు, కవిత్వమే వారి తలకెక్కదూ?

శిష్యుడు—ఇది విని పెద్దయ్యంగారు కూడా నిర్విణ్ణు లయిపోయారండి.

తిమ్మకవి—అదలా వుండనియ్యి. మహామంత్రులవారికి వొక రాచకార్యంలో దారి కనపడ్డం లేదూ? అలాంటి రాచకార్యం వొకటి నడిచే సమయంలో ప్రభువువారు అంత నిశ్చింతగా కవితావినోదా లెలా సాగిస్తున్నారూ?

శిష్యుడు—కొంపలు తీసే చిక్కులు వచ్చేదాకా ప్రభువులకు వినోదాలేకాదండీ?

శిష్యుడు—అలా కాదు. (కిందికిచూస్తూ) కృష్ణదేవరాయలవా రంత ప్రమత్తు లెప్పుడూ కారు.........(కళ్లు మూసుకుని) మహామంత్రికి దారిదొరకడం లేదూ? ప్రభువు కవితా వినోదాలతో కాలం వెళ్లబుచ్చుతున్నారా? ఆపైని నాది శృంగారకవిత్వమా? (నుదుట చెయ్యి ఆనుకుని) ఇదేదో చాలా పెద్దదెబ్బ ....మర్మస్పృక్కే. ఏదో విఘాతం కనిపెట్టుకుని వున్నట్టు కనపడుతోంది.

శిష్యుడు—జాప్యం చెయ్యక ప్రబంధం చక్కగా వినిపించెయ్యండి మీరు. ఆరాచకార్యం యేదో విషమించకుండానే అగ్రహారం పుచ్చుకుంటే—(అర్ధోక్తి)

తిమ్మకవి—(విసుక్కుంటూ) మాట్లాడకురా.........ఇక నువ్వు యింటికి వెళ్లిపో. పుస్తకం యింటో యిచ్చి జాగ్రత్త చెయ్యమను.........వెళ్లు.

శిష్యుడు—చిత్తం (నుంచునేవుంటాడు).

తిమ్మకవి—వెళ్లుమరి. పెత్తనాలకు పోక తిన్నగా యింటికే వెళ్లు.

శిష్యుడు—చిత్తం. (గురువుకేసి నిదానంగా చూస్తూ అడుగులు లెక్కబెట్టుకుంటూ వున్నట్టు నడిచి వెళ్లిపోతాడు).

తిమ్మకవి—(నాలుగడుగులు ముందుకి వేసి) మహామంత్రి మాటలకు ఏమిటి అర్థం?......నాది శృంగార కవిత్వమా?... నాది మట్టుకే శృంగారకవిత్వమా? ఇందులో పెద్దయ్యంగారు మాత్రం యేం తక్కువ తిన్నారూ?......... దేశం అంతా నిష్కంటకంగా వున్న స్థితిలో-ప్రజ, అన్నవస్త్రాలకు లోటెరక్కుండా భాగ్యభోగ్యాలతో తులతూగుతూవున్నప్పుడు శృంగారకవిత్వం కాక మరేం కవిత్వం వస్తుందీ? (ఇంకా కొంచెం ముందుకి నడిచి) ఇందులో యేదో పెద్దదెబ్బే వుంది.........ఏమీ సందేహం లేదు......... అమ్మాయినిచూసేసి, యింటికివెళ్లి, యిదేదో కనిపెట్టాలి.........ఇన్నాళ్లకి నేను ప్రబంధం చెయ్యడమూ, ప్రభువు అత్యుల్లాసంతో వింటూ వుండడమూ, పైగా పెద్దయ్యంగారి వంటి మహామహులు దాన్ని మెచ్చుకుంటూ వుండడమూ-ఇలాంటి సందర్భంలో యీచిరుమచ్చేమిటీ? (ఆలోచిస్తూ వెళ్లిపోతాడు.)

౨

తిరుమలదేవి నగరి ఆవరణ. ద్వారం యికి పదడుగుల్లో వుందనగా పెద్ద అశోక వృక్షం. దానికింద వొకఅరుగు. అరుగుమీద తిమ్మకవి కూచునీ, కొంచెం యెడంగా తిరుమలదేవి దాది మంగ నుంచునీ వుంటారు. చీకటి పడుతూ పడుతూ వున్నసమయం. పక్షుల కిలకిలారావాలు కొంచెం తగ్గాయి. చెట్లు కొమ్మల చాటునుంచీ, తీగల చాటునుంచీ నగరిదీపాలు మిణుకూ మిణుకూ కనపడుతున్నాయి. మధ్యమధ్య పరిచారికలమాటలు కూడా కొంచెం వినపడుతున్నాయి.

మంగ—అసలు, ఖండితనాయిక అంటేనే పురుషులు చెవికోసుకుంటారు. అందులో ఆనాయిక సత్యభామా దేవీ, నాయకుడు శ్రీకృష్ణుడూనూ. ఆపైని, రచన తమదీ. ఇక ప్రభువు పరమానందపడుతూ వుండడంలో ఆశ్చర్యం యేమిటి బాబయ్యా?

తిమ్మకవి—అది నిజమే. నాకవిత్వం విని ప్రభువూ, ప్రభువుకంటే సభ్యులూ చాలా ఆనందిస్తున్నారు. అది చూసుకొని నేను పరవశుణ్ణే అయిపోతున్నాను; కాని రెండుగడియల కిందట నావుత్సాహం అంతా పూర్వపక్షం అయిపోయింది.

మంగ—(ఏమీ యెరగనట్టు) అదేం బాబయ్యా?

తిమ్మకవి—దానితో నాతల దిమ్మెక్కిపోయింది. రేపు, రాజసభలో, నేను నాకవిత్వం వినిపించగలుగుతాననీ, వినిపించగలిగినా, ప్రభువుని ఆనందపెట్టగలననీ నా కెంతమాత్రమూ ధైర్యం కలగడం లేదు.

మంగ—ఏం బాబయ్యా? ఏం వచ్చిందీ యింతట్లోనూ?

తిమ్మకవి—రాచకార్యాల్లో యేవో చిక్కులు వచ్చాయిట. మహామంత్రి నాకవిత్వం వింటూ వున్నట్టు లేదు. ఊరికే సభలో కూచుంటున్నారు; గాని వారి కీధ్యానమే వున్నట్టు కనపడ్డం లేదు.

మంగ—మహాప్రభువు నిరుత్సాహంగా వున్నట్టు గాని, యేదో ఆందోళనపడుతూ వున్నట్టు గాని కనపడదే?

తిమ్మకవి—అది కూడా నామనస్సుని గజిబిజి పెడుతోంది. మహామంత్రిని కంగారుపెట్టే రాచకార్యాలు మహాప్రభువుని మాత్రం చీకాకుపరచవూ?

మంగ—తమరు సెలవిచ్చేది నాకేమీ బోధపడడమే లేదు బాబయ్యా?......మన ప్రభువు, రాజ్యం మంత్రిఅధీనంచేసి విలాసాలలో మునిగిపోయేవారు కారే?

తిమ్మకవి—అంచేతే నాకు తూర్పూ పడమరా యేమీ తెలవకుండా వుంది...... అదలా వుండగా - ఇక యిక్కడిసంగతి. సభలో నేను నా కవిత్వం వినిపిస్తూ వుండగా తెరవెనక వుండి అమ్మాయి కూడా ఆలకిస్తున్నారు కదా. మహాప్రభువు చేసే ప్రశంసలు కూడా వింటూనే వున్నారు కదా. సభలో

నుంచివచ్చి నగరిలో రెండుగడియలుండినా-వొకనా డేనా ఆ విషయమే మాట్లాడరేం?

మంగ—(మొగం పక్కకి తిప్పుకుని) అమ్మాయికి తమతో లోకాభిరామాయణం చెప్పుకోడంతోటే సరిపోతోంది, యిక కవిత్వాన్ని గురించి మాట్లాడడానికి కవకాశం యేది బాబయ్యా?

తిమ్మకవి—ఇదివర కెప్పుడూ అమ్మాయి యింత మందకొడిగా వుండడం నేను చూడలేదు. అంతఃపురంలో అమ్మాయిగారంత చురుకైన మనిషి మరి లేరని కూడా ప్రసిద్ధి. ఏదేనా వొక పద్యం చదివితే అమ్మాయి, దాన్ననేకవిధాల సమన్వయించి భావం విస్తరిస్తారే? అలాంటి పండితురాలు ఇప్పుడు నాతో యేదో విధిలేక మాట్లాడుతూ వున్నట్టూ, నన్ను తొరగా పంపెయ్యడానికి మాటలు తెమిల్చేస్తూ వున్నట్టూ కనపడతారేం?

(మంగ, మొగం పక్కకి తిప్పుకొని పెద్ద నిట్టూర్పు విడుస్తుంది. దాంతో తిమ్మకవికి ఆరాటం మరింత పెరిగిపోతుంది.)

తిమ్మకవి—మాట్లాడవేమే మంగా? నిదానించి చూడగా నువ్వుకూడా నిరుత్సాహంగానే వున్నట్టు కనబడుతున్నావేమే?

మంగ—(మొగం వంచుకొని) అమ్మాయిమనస్సేమీ బాగాలేదు బాబయ్యా?

తిమ్మకవి—(ఆదుర్దాగా) ఏం? ఏం వచ్చిందీ.........ఎక్కణ్ణుంచీ అప్రియమైన వార్త ఏదీ రాలేదుకదా? మనవాళ్లో అంతా బాగా వున్నారా?

మంగ—కారణం యిక్కడే ఏర్పడింది బాబయ్యా! మరెక్కణ్ణుంచీ వూడిపడలేదు.

తిమ్మకవి—ఏమిటదీ? ఎలా ఏర్పడిందీ?

మంగ—(మొగం పక్కకి తిప్పుకొని నిట్టూరుస్తుంది.)

తిమ్మకవి—నువ్వెందుకు జాప్యం చేస్తున్నావో తెలవడంలేదు. నువ్వు కాలయాపన చేసినకొద్దీ నామనస్సు మరింత చెదిరిపోతోంది.

మంగ—నామనస్సు బాగా లేక నేను చెప్పలేకపోతున్నాను. తమరు కూడా నాలాగే అయిపోతే యింకెలాగా? అమ్మాయి విచారం పోగొట్టడానికి నేను పడ్డ శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీ రయిపోయింది. ఇక తమర్ని నమ్ముకుని వున్నాను నేను. తమరు వుండే మనస్సు పాడుచేసుకుంటే—(అర్ధోక్తి)

తిమ్మకవి—నన్ను నమ్ముకుని వున్నావా?..............అయితే యిప్పటిదాకా చెప్పావు కాదేం?

మంగ—గడియకిందటే తేలిపోయింది నావల్ల యింకేమీ లాభం లేదని. రేపు పొద్దున్న తమ యింటికి వచ్చి అంతా మనవి చేసుకోవా లని యిప్పుడిప్పుడే నిశ్చయం చేసుకున్నాను.

తిమ్మకవి — అయితే, ఏదీ, త్వరగా చెప్పూ.

మంగ—ప్రభువు వారంరోజులనుంచి నగరికి రావడం లేదు. అమ్మాయి ఏం కానుకలు పంపినా స్వీకరించడం లేదు. నేనేం మనవి చేసుకున్నా వినిపించుకోవడం లేదు.

తిమ్మకవి — అబ్బా!............ఇంత గొడవ వుందా?..........అయితే, దీనికి కారణం ?

మంగ—అది కారణం అనిపించుకోడానికే చాలదు ; కాని అదేం పుణ్యమోగాని ప్రభువు, దానికేమిటేమిటో చిలువలూ, పలవలూ పెంచుకుని మనస్సు విరిచేసుకుని—(అర్ధోక్తి)

తిమ్మకవి—అన లేం జరిగిందీ?.........నువ్వు నానుస్తూ చెబితే నేను తాళలేను.

మంగ—మొన్నటి శుక్రవారం, రాజమహేంద్రవరంనుంచి వచ్చిన వేశ్య వీణ వాయించింది కాదూ ?

తిమ్మకవి—అవునుట.

మంగ—ప్రభువు పరవశులైపోయారు.

తిమ్మకవి—విన్నాను.

మంగ—వారిని తోడుకు వెళ్లడానికి వెళ్లి నేను కూడా బొమ్మ నయిపోయాను.

తిమ్మకవి—ఊఁహూ.

మంగ—ఈ కారణంవల్ల ప్రభువు నగరికి వచ్చాటప్పటికి అర్థరాత్రి దాటిపోయింది.

తిమ్మకవి—సరే.

మంగ—ప్రభువు రాక అమ్మాయి యెరగరు.

తిమ్మకవి—(ఆలోచిస్తూ) అలా జరిగిందా ?

మంగ—అంతవరకూ బాగానే జరిగింది. పుట్టి మునక తరవాతే సంభవించింది.

తిమ్మకవి—వివరంగా చెప్పు.

మంగ—భర్త వచ్చేదాకా నిద్ర ఆపుకోలేకపోతే స్త్రీలు కాళ్లదిక్కున శిరస్సు పెట్టుకొని పడుకోవడం మామూలే కాదూ?

తిమ్మకవి—అమ్మాయి అలాగే చేశారన్న మాట.

మంగ—అవును బాబయ్యా! అయితే: నేను అమ్మాయిని లేపుదామని బయలుదేరాను; గాని వద్దని ప్రభువు నన్ను వారించారు.

తిమ్మకవి—ప్రత్యుత్థానం—(అర్ధోక్తి)

మంగ—అదేమీ కాదు బాబయ్యా! అసలు కారణం ముందే వుంది.

తిమ్మకవి—నేను వినకూడదనిదా?

మంగ—అలాంటిదీ కాదూ...అసలది కారణమే అనిపించుకోదూ.

తిమ్మకవి—నువ్వు డొంక తిరుగుడుగా (అర్ధోక్తి)

మంగ—చిత్తగించండి...ప్రభువు సెలవు పొంది నేను ఇవతలికి వచ్చేశాను.

తిమ్మకవి—ఊహూ.

మంగ—ప్రభు వేనా అమ్మాయిని లేప కుండా వొక పక్కగా శయనించారు.

తిమ్మకవి—బోధపడ లేదు.

మంగ—ప్రభువు యథాపూర్వంగానే పడుకున్నారు.

తిమ్మకవి—అంటే అమ్మాయి కాళ్లు ప్రభువుశిరస్సుకేసీ, ప్రభువుకాళ్లు అమ్మాయి శిరస్సుకేసీ-(అర్ధోక్తి)

మంగ—అవునండి.

తిమ్మకవి—రెండోది ధర్మంగానేవుంది. అమ్మాయి యెప్పుడూ ప్రభువు పాదాలు కొలుచుకుంటూనే వున్నారు.

మంగ—ఆవేళ అలా వచ్చింది కాని ప్రభువు మాత్రం అమ్మాయి పాదాలు-(సిగ్గుతో తల వంచుకుంటుంది.)

తిమ్మకవి—అది సరే లే.

మంగ—తాము మెళుకువగావున్నారు కనక ప్రభువు పుస్తకంలాగే పడుకున్నారు; కాని నిద్రలో పక్కకి వొత్తిగిల్లడంలో అమ్మాయి కాళ్లు ప్రభువు శిరస్సుకి—(అర్ధోక్తి)

తిమ్మకవి—తగిలాయా?

మంగ—తగిలాయంటే వూరికే స్పర్శ మాత్రమే. తామరతూళ్లకంటె మెత్తనిపాదాలు—(అర్ధోక్తి)

తిమ్మకవి—ఇంత మాత్రానికే ఆగ్రహమా?

మంగ—ఆగ్రహం అంటే యిక యింతా అంతానా? ప్రభువు అమ్మాయి నగరి కేసి చూడడం కూడా మానుకున్నారు.

తిమ్మకవి—(కిందకి చూస్తూ ఆలోచనలో పడతాడు.)

మంగ—ఇంతకీ: స్పర్శవల్ల వెంటనే మెళుకువ రాగా, జరిగింది స్ఫురణకి రాగా, అమ్మాయి, వెంటనే ప్రభువు పాదాలు పట్టుకుని బతిమాలుకున్నారు. ఎంతో పశ్చాత్తాప పడ్డారు; కాని ప్రభువు వినిపించుకోలేదు. ఇక నుంచోలేదు కూడానూ

తిమ్మకవి—(చకితుడై) ఏమిటీ?

మంగ—ఈక్షణందాకా మరి నగరికి రాలేదు. అమ్మాయి ప్రార్థనాపత్రాలు పంపారు. నేను కాళ్లా వేళ్లా పడ్డాను. ప్రభువు వొక్కటే పట్టు—(అర్ధోక్తి)

తిమ్మకవి—పెద్ద గొడవే......అయితే నాకు ముందే యెందుకు చెప్పావు కాదూ?

మంగ—ఇంత ముదురుతుం దని యెవరికి తెలుసును బాబయ్యా?

తిమ్మకవి—(కిందికి చూస్తూ, నిట్టూర్పులు విడుస్తూ ఆలోచన ప్రారంభిస్తాడు).

మంగ—విచారంతోపాటు వుడుకుమోతుతనం ముప్పిరిగొనగా అమ్మాయికి—(అర్ధోక్తి)

తిమ్మకవి—(లేచి కొంచెం ఆవేగంతో) నాబిడ్డకు తిరస్కారమూ, నాకు సత్కారమూనా?

మంగ—అమ్మాయికి నిద్రలేదు, హారం లేదు. రెండు గడియలకిందట కసిన్ని పాలు తాగించడం బ్రహ్మాండంఅయిపోయింది నాకు. రాత్రి యింకోమాటు తాగించగలనో ఏదో. (అర్ధోక్తి)

తిమ్మకవి—(కిందికి చూస్తూ, తల పంకిస్తూ) అదలా జరిగిందా?.........ఇదిలా జరుగుతోందా?.........నీవల్ల ఏమీ కాలేదూ?.........నే నిదేమీ యెరక్కుండా కవిత్వంలో పడి కొట్టుకుంటున్నానా? పైగా శృంగారకవిత్వం—(ఉలిక్కిపడి) బోధపడుతోంది.........బోధపడే పోయింది........ ఎంత దెబ్బ కొట్టారూ మహామంత్రీ? (జలదరించుకొని) బల్లెంలాగ గుచ్చుకుంటోంది ఆ మాట. (గుండెలమీద చెయ్యి పెట్టుకుని) హృదయం చిల్లులు పడిపోతోంది......నే నిక్కడెందుకున్నానూ?......అస లెందుకు వచ్చానూ?......నాప్రభువుకి నేనేం సమాధానం చెప్పగలనూ?......నన్ను అమ్మాయితో పంపుతూ "తల్లీతండ్రీమీ రే"అన్నారు మహారాణీ. వారిమొగం నే నిక యెలా చూడగలనూ? (కొంచెం గబగబా పచారు చేస్తాడు.)

మంగ—(ఓరకంట చూస్తూ) బాబయ్యకి వేడి పుట్టింది. ఇక ఫరవా లేదు.

తిమ్మకవి—(పచారు చేస్తూ) రాయలవారు సభలో కనపరుస్తూవున్న మెప్పంతా వొట్టి బూటకం అన్నమాట. అది అమ్మాయిని మరింత పరాభవం చెయ్యడం అన్నమాట.

మంగ—బాబయ్యా,చీకటిపడుతోంది.

తిమ్మకవి—నా హృదయం అంధకారబంధురమే అయిపోయింది. ఆపైని గాలివాన-తుపాను—దావానలం—(అర్ధోక్తి)

మంగ—ఆవేశం పొంది కూచుంటే యేం లాభం బాబయ్యా?

తిమ్మకవి—(తల పంకిస్తూ) నిజమే...నిజమే......పైగా ఆవేశం పొంది విసుగుదామంటే నేను పట్టింది గంటమాయె......(ఏదో స్ఫురణ అభినయించి) బాగుంది....చాలా బాగుంది......పుణ్యకాలం కాస్తా దాటిపోకుండా నేమహామంత్రులవారు నాకళ్లు తెరిచారు.........మంగా! బాబయ్య జీవచ్ఛవం కాలేదని చెప్పు అమ్మాయితోటి...వెళ్లు.

మంగ—చిత్తం. (చూస్తూ, నుంచునే వుంటుంది.)

తిమ్మకవి—ఇక వెళ్లు...నుంచోకు...వెళ్లిపో.

మంగ—ఇంటిదాకా వస్తాను బాబయ్యా!

తిమ్మకవి—వద్దు వద్దు. అమ్మాయిదగ్గిరికే వెళ్లు. అమ్మాయికి కాస్త ధారకంయిచ్చే ప్రయత్నంలో వుండు.........వెళ్లు మరి.

మంగ — ఎదురుచూస్తూ వుంటాము.

తిమ్మకవి — రేపీపాటికి...... తెలిసిందా? ఇంతకంటే కొంచెం ముందే కావచ్చు. సందేహం లేదు.

మంగ — సెలవు. (వెనక్కి తిరిగితిరిగి చూస్తూ వెళ్లిపోతుంది.)

తిమ్మకవి — మాంచిసమయంలో మహామంత్రి బల్లెంతో పొడిచి లేపారు......... తలుచుకుంటే సిగ్గుసిగ్గు. కవిత్వంలో — శృంగారకవిత్వంలో పడి ప్రపంచకం — శరీరం కూడా మరిచిపోయాను. అగ్రహారం — గజారోహణం — జాంబూనదాంబరాభరణాలు — ఛిక్! పూర్తిగా స్వార్థం......విశ్వశ్రేయస్కరమైన కవిత్వాన్ని నరస్తుతిలో వినియోగించడమే కాకుండా, నాప్రభువు పెట్టిన పని మరిచిపోయి — (స్ఫురణ అభినయించి) నాపూర్వపుణ్యావశంవల్ల శృంగారకవిత్వం కూడా యిప్పుడు కార్యసాధకమే అయేలా వుంది. అయేలా గుండడమేమిటి అయితీరుతుంది... మళ్లీ రేపు సాయంత్రం కదా సభలో గ్రంథపఠనం? (ఆలోచించి) ఈరాత్రి కథ ఇలా తిప్పేద్దాం. సత్యభామాదేవిని, తిరుమలదేవికి మేలుచేసేటట్టు చిత్రిద్దాం ... ... సెబాస్! మహాబాగా కుదిరింది పతకం! ప్రణయకలహంలో శృంగారకవిత్వానికే చెల్లుబడి. మన శక్తి అంతా ఇక్కడ ధారపోద్దాం. దీంతో, ప్రభువు, దారికి రాకపోతారా?.........ఎలా రాకపోతారో చూద్దాం. రాకపోతే మనది కవిత్వమే కాదూ. మనం ఇక బతికివున్నా వొకటే, లేకపోయినా వొకటే.........మనం ఇక్కడే వుండగా అమ్మాయికి తిరస్కారమా? హుఁహుఁ. చూద్దాం. (పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వెళ్లిపోతాడు).

3

భువనవిజయంలో కృష్ణరాయడు కొలువుతీరి వున్నాడు. వెనక శ్వేతచ్ఛత్రం పట్టుకొని వొక యువతీ, వింజామరలు వీస్తు రెండు వేపులా యిద్దరు యువతులూ నుంచుని వున్నారు. వెనక, పట్టుతెరలో తిరుమలదేవి తప్ప తక్కిన రాణులూ, వారి పరిచారికలూ, తిరుమలదేవిదాది మంగా, సామంతుల భార్యలూ వున్నారు. సింహాసనానికి కుడివేపున మహామంత్రి తిమ్మరుసూ, అల్లసాని పెద్దన్నా, ధూర్జటికవీ, తక్కిన కవులూ, పండితులూ వరసగా కూచునివున్నారు. ఎడమవేపున సామంతులూ, సేనాధిపతులూ, యోధులూ వరసగా కూచుని వున్నారు. ఎదటా, పక్కలా, గోడలకు చేరికగా పౌరులనేకతరగతులవారు చేతులు కట్టుకుని, తలలు వంచుకుని నుంచునివున్నారు. సింహాసనానికి ఎదట నాలుగైదు గజాలదూరంలో వొకయెత్తయిన పీటమీద కూచుని తిమ్మకవి పారిజాతాపహరణం చదువుతున్నాడు.

తిమ్మకవి —

క. ఈ పగిదిఁ సాత్రాజితి　　　　[సం
　　కోపోద్యోగమున వగల బొగులుచు ఘన

తాపంబు పేర్మి నితర
వ్యాపారము మానియుండె హరియును
[నచటన్॥

మ. ముని నాకిచ్చిన పూవు చందమును, నే
మున్నాడి యీభోజనం
దన కర్పించిన జాడయుం దెలియ జెం
తం బొంచి వీక్షించి పో
యిన సాత్రాజితి బోటి నావలన దా
నేమేమి కల్పించెనో
యని ప్రద్యుమ్ను ని పూని దండ నిడి చిం
తాయత్తచిత్తంబునన్॥

చ. అరదము నెక్కి కేతన ప
టాంచల చంచలమైన తాల్మితో
దురగజవంబు మున్గడవ
ద్రోచి కడంగెడు తత్తరంబుతో
దిరిగెడు బండికండ్ల పగి
దిక్ భ్రమియించు మనంబుతోడ నా
హరి సను దెంచె, సత్యసము
దంచిత కాంచనసౌధవీథికిక్॥

రాయడు—అది మళ్లీ వొకమాటు సెల విప్పించండి.

తిమ్మకవి—చిత్తం మహాప్రభూ! (అరదము నెక్కి – చదువుతాడు).

రాయడు—పెద్దయ్యంగారు సావధానంగా చిత్తగించారా ఆపద్యం?

పెద్దన్న—చిత్తం మహాప్రభూ! కల్పన చాలా చక్కగా వున్నది.

రాయడు—ధూర్జటికవిగారేమి సెలవిస్తారో?

ధూర్జటి—చిత్తం జగత్ప్రభూ! నిన్న సాయంత్రం నాకు తిమ్మకవిగారిమీద చాలా కోపం వచ్చింది; కాని యిప్పుడు చాలా మెప్పు కలిగింది.

రాయడు—ఏమో?

ధూర్జటి—నిన్న సాయంత్రం చివరి పద్యంలో తిమ్మకవిగారు సత్యాదేవిని మదహస్తిహస్తగతపద్మంగా చిత్రించారు. ఇప్పుడు బతిభేదం లేకుండా శ్రీకృష్ణులవారిని కూడా అలాగే తయారుచేశారు. కనక అంచేత కోపమూ, ఇంచేత మెప్పూ కలిగాయి అభినవభోజరాజేంద్రా!

రాయడు—తమరు చక్కగా చమత్కరించారు. (తిమ్మకవిని చూసి) తమరు కానివ్వండి.

తిమ్మకవి.—చిత్తం మహాప్రభూ!

గీ. వచ్చి, యరదంబు డిగ్గి, తద్ద్వారసీమ
దారుకునినుండ నియమించి, తాన యొకడు
కమలనాభుండు కక్ష్యాంతరములు గడచి
యలబలము లేని నగ రెల్ల నరసి చూచి.

సీ. కనకపంజర శారికలకు జక్కెర వెట్టి
చదివింప రేలొకో సకియ లిపుడు
కరతాళగతుల మందిరమయూరంబుల
నాడింప రేలొకో యతివ లిపుడు
క్రొవ్వాడిగోళ్ల దంత్రులు మీటి వీణియ
ల్వాలికింప రేలొకో భామ లిపుడు

కలికిరాయంచబోదల నెల్ల నెలయించి
నడిపింప రేలొకో పడతు లిపుడు

గీ. ఇన్నిదినములవలె నుండ దేమి నేడు?
చిన్నబోయిన దీమేడ చెన్ను దరిగి;
పద్మముఖితోడ నెవ్వరే బారిజాత
పుష్పవృత్తాంత మెరిగింప బోలునొక్కొ?

క. అని యనుమానించుచు నొ
య్యన గోపగృహంబు సేరి, యాసత్రాజి
త్తనయ ముసుంగిడి యుండగ
ననువు మెరయ జొచ్చి మాయ యచ్చు
[పడంగన్.

ఉ. కొందర మంతనంబులను,
గొందర జంకెనవాడి చూపులన్
గొందర జేతిసన్నల ద
గుల్పడ జేయుచు జేరబోయి మ
ధ్యందినభానుమండలక
రావళి హావళి వాడియున్న తీ
గం దలపించు నమ్మగువ
గన్గొని యెంతయు విస్మితాత్ముడై.

ఉ. ఈలలితాంగి చంద మొక
యించుక చూచెద నంచు ధూర్తగో
పాలుడు, తాలవృంత మొక
భామిని సత్యపిఱుంద నుండి మం
దాలస లీలమై విసర,
నాదట గైకొని వీచె, తద్వపుః
కీలిత పంచసాయకశి
ఖిన్ దరికొల్పుచు నున్న కైవడిన్.

రాయడు—బాగున్నది. అది మళ్లీ ఒక మాటు సెలవిప్పించండి.

తిమ్మకవి—చిత్తం మహాప్రభూ! (ఈ లలితాంగి–చదువుతాడు).

రాయడు—శ్రీ కృష్ణులవారి తత్వం చక్కగా ప్రదర్శించారు తిమ్మకవిగారు. ఏమి అప్పాజీ! తమ రేమి సెలవిస్తారూ?

తిమ్మరుసు—తిమ్మకవిగారు ప్రకృతిని సరిగా చిత్రించారు. అంతే మహాప్రభూ!

రాయడు—అంటే?

తిమ్మరుసు—దక్షిణ నాయకుల ప్రవృత్తి అలాంటిది. తిమ్మకవిగారు ఈసంగతి మరిచి పోలేదు. నేను విన్నవించుకుంటూ వున్న దిదీ జగత్ప్రభూ.

రాయడు—(ఉలిక్కిపడతాడు)

తిమ్మకవి—(రాయని స్థితి గ్రహించి, తనలో) మహామంత్రి నామార్గం పరిష్కృతం చేస్తున్నారు.

పెద్దన్న—నేనొక్కసంగతి విన్నవించు కుంటాను మహాప్రభూ!

రాయడు—సెల విప్పించండి.

పెద్దన్న—శ్రీకృష్ణులవారు పరిచారిక చేతి వీవన పుచ్చుకొని సత్యాదేవిగారికి వీచడం దక్షిణనాయకుడికి అర్హంగానేవుంది. అయితే: తిమ్మకవిగారు, అంతమాత్రమే చెప్పి వూరుకోక "తద్వపుఃకీలిత పంచసాయకశిఖిన్ దరికొల్పుచునున్న కైవడిన్" అని దానికి హేతువు చూపించారు. అంచేత ఈపద్యంలో చాలా విశేషం వుంది. ఇది మహామంత్రుల వారికి తెలవనిదా రాజదేవేంద్రా?

రాయడు—(తిమ్మరుసు కేసి చూస్తాడు).

తిమ్మరుసు — పెద్దయ్యంగారు సెలవిచ్చింది యిప్పటిమట్టుకు చక్కగానే వున్నది. కాని తిమ్మకవిగారు దీనిని యెలా పర్యవసింపచేశారో చూస్తేగాని నే నిప్పుడింతకంటే యేమీ చెప్పలేను మహాప్రభూ!

రాయడు—(చిరునవ్వుతో) తమరు పెద్ద చర్చకు విఘ్నేశ్వరపూజ చేశా రన్నమాట.

తిమ్మరుసు—మహాకవులతో చర్చలు సాగించడానికి నేను తగను. నే నందుకు సిద్ధపడడం వారిని న్యూనతపరచడంకూడా కావచ్చు. అయినా, పుంభావసరస్వతు లైన యేలినవారి సమక్షంలో తటస్థించిన అవకాశం జారవిడుచుకోవడం మంచిదికాదు. అదీన్నీకాక; నేను సాహిత్య వ్యవసాయిని కాదు కనక ఇందులో ఓటమి సంభవించినా నాకు కలిగే ఇబ్బంది యేమీ లేదు రాజాధిరాజా!

పెద్దన్న—మహామంత్రులవా రేం సెలవిచ్చినా అది మా యెడల వుండే అనుగ్రహానికి గుర్తు. కాక: నిజం చెప్పకోవలసి వస్తే మేము కవుల మని పేరేగాని సాహిత్యవిద్యలో కూడా వారికి శిష్యప్రాయులమే. అయితే, మ మ్మేలినవారికి వినోదప్రాయంగా వుంటుం దంటే యుక్తసమయంలో కొంచెమో గొప్పో చర్చ జరిగించనే వచ్చు మహాప్రభూ!

రాయడు—(చిరునవ్వుతో) చివరికి, చిలికి చిలికి గాలివాన అయేటట్టుంది. (తిమ్మకవికేసి ప్రశ్నార్థకంగా చూస్తాడు).

తిమ్మకవి—చిత్తం మహాప్రభూ! పెద్దవారితో వాగ్వాదం యెంతో అదృష్టంవుంటే గాని సంభవించదు. అందులోనూ, ఏలినవారి సమక్షంలో అది జరగడంలో చాలా విశేషం కూడా వుంది. సావధానంగానే వుంటాను సాహిత్యచక్రవర్తీ!

రాయడు—(చిరునవ్వుతో) ధూర్జటి కవిగారి కిందులో పెద్దభాగమే వుంటుం దని నమ్ముతున్నాము.

ధూర్జటి—చిత్తం జగత్ప్రభూ! ఏలినవారి ఆజ్ఞకు బద్ధుణ్ణయి వున్నాను.

రాయడు—(కుడివేపుకి చూస్తూ) తక్కిన కవీంద్రులూ, పండితులూ, (ఎడమవేపుకి చూస్తూ) సేనాధిపతులూ, బంధుమిత్రులూ, (ఎదుటచూస్తూ)పౌరశ్రేష్ఠులూకూడా యథోచితంగా ఆవాదంలో పాల్గొంటా రని భావిస్తున్నాము.

(అందరూ ఉత్సాహభరితు లవుతారు. శిరస్సులు వంచి తమ ఆమోదం కూడా సూచిస్తారు.)

రాయడు—(తిమ్మకవితో) ఇక తమరు కానివ్వండి.

తిమ్మకవి—చిత్తం మహాప్రభూ!

ఉ. అంతట పారిజాతకుసు
మాగతనూతనదివ్యవాసన

ల్వింతలు సేయ, దావి యది
　విస్మయ మంచు ముసుంగు ద్రోచి య
క్కాంత గృహాంబు నల్గడలు
　నారసి సంభృత తాలవృంతు నిం
గాంతుని జూచి, బాష్పకణి
　కాతరళీకృతలోచనాంతయై.

గీ. తల వాంచి మగుడ ముసు గిడె
గొలకులడిగజారి జాలుకొను బాష్పంబుల్
పలుచని చెక్కుల లవలీ
దళపతిత మరందబిందుతతి బురడింపన్.

ఉ. ఓ ర్వొక యింత లేని వికచోత్పలలోచన చిత్తవీథి జ
ల్లార్పగ నీలనీరదశు
　భాంగుడు వేసను దెంచె నంచు గం
దర్పహుతాశను ల్వెలికి
　దార్చు సఖుండును బోలె వేడిని
ట్టూర్పు దళంబుగా నిగిడె
　నున్న మితావరణాంశుకాంతమై.

చ. వనిత కుచద్వయంబు పయి
　వ్రాసిన కుంకుమపత్రభంగముల్
జనితనితాంతఘర్మకణ
　జాలము చేత గరంగి, మెల్ల మె
ల్లన వెలిపట్టుపయ్యెద కె
　లంకులజారుట యొప్పె, మానసం
బున నెలకొన్న క్రోధరస
　మ్ముగ వడబెట్టుచునున్న కైవడిన్.

రాయడు—అది యింకోమాటు వినిపించండి.

తిమ్మకవి—చిత్తం మహాప్రభూ! (వనిత కుచద్వయంబు – చదువుతాడు).

రాయడు—మంచి కల్పన. చాలా బాగున్నది. (తిమ్మరుసు కేసి చూస్తాడు).

తిమ్మరుసు—చిత్తం మహాప్రభూ!

రాయడు — (తిమ్మకవితో) తమరు కానివ్వండి.

తిమ్మకవి—చిత్తం మహాప్రభూ!

క. మానవతి యిట్లు మానని
మానక్రోధములచే గుమారిలి చింతా
దీనగతి నుండ, మదిలో
నూనినప్రేమమున నంబుజోదరుడనియెన్.

ఉ. ఇందునిభాస్య! మైతొడవు
　లేల ధరింపవు? నున్నగావు లీ
వెందును మానలేవు తెలు
　పెందుకు గట్టితి? వీటికారుచు
ల్కెందలిరాకు మోవి దల
　కింపగ జేయక యున్కియేమి? నీ
చందము వింత యయ్యెడు ని
　జంబుగ నాకెరుగంగ జెప్పవమా?

చ. మన మరయం దలంచి యొక
　మార్గము వన్ని తొనవ్వుటాలకో?
నను వెరపించెదో? యకట
　నాయెడ నిక్కము తప్పు గల్గెనో?
వనజదళాయతాక్షి! పగ
　వాడనె? నన్నిటు లేల చూడ? వొ
క్క నిమిష మైన నీవు దయ
　గన్గొనకుండిన నిల్వనేర్తునే?

చ. పలుకుల దేనె లుట్టిపడ
బల్కవు నే డిది యేమి? వాలుగ
న్నుల నునుసిగ్గు నూల్కొన గ
నుంగొన వేల? యురస్థలంబు జ
న్నుల నెదురొత్తి మక్కువ న
నుం బిగికౌగిట జేర్ప వేటికే?
చిలుకలకొల్కి యెవ్వ రెడ
సేసిరి? నీ కిటు లేల చింతిలన్?

చ. మనముల మాటలం గ్రియల
మన్నన లీ నొకనాడు నెట్టి కా
మినులకు, గారవంబు మెర
మెచ్చులకై పచరింతు గాని; పా
యని యనురక్తి నీయెడన
యగ్గలమై కనుపట్టు నాకు; నీ
పనిచిన పంపు సేయుటయ
ప్రాభవ మౌ టది నీ వెరుంగవే?

మ. పడతీ! నీమధురాధరామృతము నీ
బాహాపరీరంభమున్
బడయన్ ధన్యుడ గాక యుండిన నను
న్నాటించి, యొక్కింత నీ
నిడువాలుం గడగంట జూడు మనుచు
న్నిల్పోపమిం, బైచెరం
గొడియం, జేవిరిదమ్మి వ్రేయుటకునై
యుంకించి జంకించినన్.

రాయడు—శ్రీకృష్ణులవారి ప్రసంగం చాలా బాగున్నది. ఆంధ్రకవితాపితామహు లేమి సెలవిస్తారో?

పెద్దన్న—చిత్తం, రాధాదేవిగారు దిద్దిన రసికులు శ్రీకృష్ణులవారు, మహాప్రభూ!

రాయడు—తమకు ఉన్నది వున్నట్టుగా సెలవిచ్చారు. (తిమ్మరుసు కేసి చూస్తాడు).

తిమ్మరుసు—తిమ్మకవిగారు శ్రీకృష్ణుల వారి ఔచిత్యం చక్కగా పోషించారు మహాప్రభూ!

రాయడు—ఎలాగా?

తిమ్మరుసు—శ్రీకృష్ణులవారు తమ తప్పెరిగి మసులుకుంటున్నారు.

రాయడు—శ్రీకృష్ణులవారు నారద మహర్షి ప్రసాదించిన పారిజాత పుష్పాన్ని రుక్మిణీదేవిగారికి దయచెయ్యడం తప్పంటారా తమరు?

తిమ్మరుసు—నావుద్దేశం అదికాదు మహాప్రభూ! శ్రీకృష్ణులవారి యెనమండుగురు పట్టమహిషులలోనూ, కవు లందరూ, రుక్మిణీదేవిగారికీ, సత్యభామాదేవిగారికీ - ఈ యిద్దరికే ప్రాధాన్యం చూపిస్తున్నారు.

రాయడు—అవును.

తిమ్మరుసు—శ్రీకృష్ణులవారు పారిజాతాన్ని రుక్మిణీదేవిగారికి అనుగ్రహించడం బాగానే వుందని తతిమ్మా ఆగ్గురు దేవులూ సమాధానపడ్డట్టుకూడా తిమ్మకవిగారు సెలవిచ్చారు.

రాయడు—సత్యమే.

తిమ్మకవి—ఇక మిగిలినవారు సత్యభామాదేవిగారు; కాని దీనికి వారు సమ్మతిపడలేదు.

రాయడు—కనపడుతూనే వుంది.

తిమ్మరుసు—అంచేత, వారు కోపగించుకోవడమూ, కోపగృహం ప్రవేశించడమూ ధర్మమే అని శ్రీ కృష్ణులవారికిన్నీ తెలుసు.

రాయడు—సరే.

తిమ్మరుసు—రుక్మిణీదేవిగారి నగరిలోవుండగా లభించిన పుష్పాన్ని వారికే దయచెయ్యడం యెలాంటి ధర్మమో, దానిమీద, అంచేత, అసంతృప్తి పొందివున్న సత్యభామాదేవిగారిని బతిమాలి - సాంత్వనపరచడమున్నూ అలాంటి ధర్మమే కాదా రాజదేవేంద్రా?

రాయడు—బాగానే వున్నది. అయితే; ఇక శ్రీకృష్ణులవారి తప్పేమిటి; వారు, దాన్నెలా సవరించుకుంటున్నారు?

తిమ్మరుసు—సత్యభామాదేవిగారిని సాంత్వనపరచకపోతే శ్రీ కృష్ణులవారిది తప్పే అయిపోతుంది కాదా మహాప్రభూ!

రాయడు—(ఆలోచనలో పడతాడు).

తిమ్మకవి—(తల పంకిస్తూ, తనలో) కీటకం ప్రవేశించింది.

పెద్దన్న — (అపవారించి ధూర్జటితో) మహామంత్రిప్రసంగంలో యేదో ధ్వనిస్తోంది.

ధూర్జటి—(అపవారించి) కనిపెట్టారా? .... కాని అదేదో బ్రహ్మభేద్యంగా వుంది.

పెద్దన్న—(అపవారించి) బాగా గమనించాలి.

రాయడు-(తలపంకించి, నిట్టూర్పువిడిచి, తిమ్మకవితో) తమరు కానివ్వండి.

తిమ్మకవి — చిత్తం. భోగదేవేంద్రా! (రాయనికేసి గంభీరంగా చూస్తూ, తాపీగా)

ఉ. పాటలగంధి చిత్తమున
బాటిలుకోపభరంబు దీర్ప నె
ప్పాటను బాటు గామి-మృదు
పల్లవ-కోమల-తత్పదద్వయీ-
పాటలకాంతి-నాళి-మణి
పంక్తికి-వన్నియ వెట్ట-నా-జగ
న్నాటకసూత్రధారి-యదు
నందనుడు-అర్మిలి - మ్రొక్కె- -
[మ్రొక్కి—నన్.

(రాయని కనుబొమలు ముడిపడతాయి. తిమ్మరుసు మొగంమీద చిరునవ్వు మొలకలెత్తుతుంది. పెద్దన్నా, ధూర్జటీ రాయణ్ణి విడిచి తిమ్మరుసునీ, తిమ్మరుసుని విడిచి రాయణ్ణీ అదే పనిగా చూస్తూ వుంటారు. తిమ్మకవి రాయని యింగితం కనిపెడుతూ వుంటాడు.)

రాయడు—(సింహాసనానికి జేరబడి) అప్పాజీ!

తిమ్మరుసు—చిత్తం మహాప్రభూ!

రాయడు—శ్రీకృష్ణులవారు, తమతప్పు పూర్తిగా సవరించుకున్నారా?

తిమ్మకవి—ఇంకా కొంచెం తరువాయి వున్నది మహాప్రభూ!

రాయడు—సత్యభామాదేవిగారి తోడి సాహచర్యం కత్తులతో సాములా గున్నదే. (తిమ్మకవిని చూసి) తమరు కానివ్వండి.

తిమ్మకవి—చిత్తం మహాప్రభూ!

మ. జలజాతాసన (అర్థోక్తి)

రాయడు—వ్యవధానం బాగుండదు. కనక వెనకటి పద్యం మళ్లీ సెలవిచ్చి వెంటనే తరవాతి పద్యాలు అందుకోండి.

తిమ్మకవి—చిత్తం మహాప్రభూ! (వెనకటిలాగే)

ఉ. పాటలగంధి చిత్తమున
బాటిలు కోపభరంబు దీర్ప- నె
ప్పాటను బాటు గామి-మృదు
పల్లవ కోమల తత్పదద్వ యీ
పాటలకాంతి - మౌళి - మణి -
పంక్తికి - వన్నియ వెట్టె నా-జగ
న్నాటకసూత్రధారి-యదు
నందనుడు అర్మిలి - మ్రొక్కె -
[మ్రొక్కెనన్.

(దీని కేం చెబుతావూ అన్నట్టు చూస్తూ)

మ. జలజాతాసన - వాసవాది - సుర పూజాభాజనంబై తనర్చు-లతాంతాయుధు-కన్నతండ్రి-శిరము-అచ్చో-వామపాదంబునన్ -దొలగన్-(మెడ సారిస్తూ) ద్రోచె-లతాంగి-యట్ల యగు:—నాథు ల్నేరముల్ సేయ పేరలుకం జెందిన యట్టికాంత లుచితవ్యాపారముల్ నేర్తురే? (రాగం విసురుతాడు).

రాయడు—(క్రిందికి చూస్తూ తనలో) అన్యాపదేశమా యిది?

(తిమ్మరుసు తల పంకిస్తూ రాయని కేసి చూస్తాడు. తిమ్మకవి "బాగుందా?" అన్నట్టు తిమ్మరసు కేసి చూస్తాడు.)

పెద్దన—(అపవారించి, ధూర్జటితో) ఈ కల్పన ప్రభువును ఉద్దేశించే. సందేహం లేదు.

ధూర్జటి—(అపవారించి) అలాగే వుంది· అయితే: ఇంత సాహసానికి కారణం?

పెద్దన—(అపవారించి) తలా తోకా యేమీ బోధపడడం లేదు.........ప్రభువు ఏమో అంటున్నారు.

రాయడు—ఏమి, మళ్లీ పద్యం అందుకో రేమీ?

తిమ్మకవి—అందుకుంటున్నాను మహాప్రభూ!

క. కోపన పదహతి గుహనా [ను
గోపాలుడు గాంచి మెయి గగుర్పొడువగ
ద్దీపితమన్మథ రాజ్య
ప్రాపితుడై పలికె గూర్మిబయలుపడంగన్.

చ. నను-భవదీయదాసుని-మనమ్మున నెయ్యపుగిన్క-బూని-తా-చిన యది నా-కు మ-న్ననయ-చెల్వగు నీ పదపల్లవంబు మత్తను పులకాగ్రకంటకవితానము తాకున నొచ్చెనంచు నే నని మెద, నల్క మానవుగదా యిక నైన నరాళకుంతలా?

రాయడు—(ఓరకంట చూస్తూ తనలో) సందేహంలేదు. ఈ కల్పన మనకోసమే......

యుక్తంగానేవుంది. మనదే తప్పు. (తిమ్మరుసుకేసి చూసి ప్రకాశంగా) ఇవాళకి ఈపాటికి సభ చాలిద్దాము. లేస్తాడు.

తిమ్మరుసు—(లేచి) చిత్తం మహాప్రభూ! (అంతా లేస్తారు. రాయడు సభ విడిచి వెళ్లిపోతాడు. ఎక్కడివా రక్కడే లేచి మెల్లిగా మాట్లాడుకుంటూ వుంటారు.)

తిమ్మరుసు—(తిమ్మకవిదగ్గిరికి వచ్చి మెల్లిగా) మహాకవీ! మంచికల్పనచేశారు తమరు. శృంగారకవిత్వం చెరకాకుబల్లెంగా చెలామణీ అవుతుందని నే నెప్పుడూ అనుకోలేదు. తమరాక సార్థకపరుచుకున్నారు తమరు. నాఆందోళనం తీరిపోయింది. చాలా సంతోషం (బుజాలమీద తట్టుతాడు).

తిమ్మకవి—ఇదంతా తమ అనుగ్రహం. అంతా సావకాశంగా మనవి చేసుకుంటాను.

(ఇలావుండగా, వొక పరిచారిక వచ్చి తిమ్మకవినిచూసి "మహాప్రభువు సెలవయిం" దంటుంది. తిమ్మరుసు "వెళ్లండి, వెళ్లండి" అంటాడు. "నన్నే? నన్నే?" అంటూ తిమ్మకవి దాసితో వెళ్లిపోతాడు)

తిమ్మరుసు—(పెద్దన్నదగ్గిరికివెళ్లి) ప్రభువు హఠాత్తుగా సభ చాలించారు.

పెద్దన్న—కారణం తమకు తెలవాలి.

తిమ్మరుసు—అణుమాత్రమూ బోధపడడంలేదు. తిమ్మకవిగారు వస్తారు కాదూ? తెలుసుకుందాం... అయితే: ఇందాకా నా వుద్దేశం గ్రహించారా తమరు?

పెద్దన్న—అది యిప్పుడు బోధపడింది. శ్రీ కృష్ణులవారు పరిచారిక చేతి తాళవృంతం పుచ్చుకుని వీచినప్పుడు, తిమ్మకవిగారు "తద్వపుః కీలిత పంచసాయకశిఖిక్షుదరి కొల్పుచు నున్న కైవడిన్" అని వుత్ప్రేక్షించారు. కాని, వారు, అలా చెయ్యడంవల్ల సత్యభామాదేవిగారు, ఈర్ష్య చెంది - అంటే వుడుకుమోతుతనం వచ్చి పాదప్రహారం చేశారు; గాని ముగ్ధలై ఆశ్లేషం చెయ్యలేదు. ఇలాగ ఆ మాటకీ యీ చేతకీ అతకలేదు... ఇంతే కాదూ?

తిమ్మరుసు — తమరు సరిగా గ్రహించారు......మరి లోపల పనివుంది సెలవు.

పెద్దన్న—చిత్తం, సెలవు.

(తిమ్మరుసు లోపలికి వెళ్లిపోతాడు. తక్కినవారు ఒక్కరొక్కరుగానూ, జతలు జతలుగానూ ఏమిటేమిటో చెప్పుకుంటూ బయటికి వెళ్లిపోతారు.)

౪

రాయడు, తిరుమలదేవినగరికి పోయే దారిలో నుంచుని వుంటాడు. పదిగజాలలో, చేతులు జోడించుకుని మంగ నిలిచివుంటుంది. తక్కిన రాణుల పరిచారికలు, కొంచెం దూరంలో, చెట్లచాటున నుంచుని తొంగితొంగి చూస్తూ గుసగుసలాడుకుంటూ

వుంటారు. తిమ్మకవికి రాయణ్ణి చూపించి పరిచారిక నిలిచిపోతుంది. తిమ్మకవి కొంచెం కంగారుపడుతూ రాయణ్ణి సమీపిస్తాడు.)

తిమ్మకవి—(వంగి చేతులు జోడించుకుని) చిత్తం మహాప్రభూ!

రాయడు—తమకుకూడా ఆయాసం కలిగించాము. (చేతులు జోడించుకుని) క్షమించ కోరుతున్నాము.

తిమ్మకవి — అదేమిటి జగత్ప్రభూ? ఏలినవారి నాశ్రయించుకునివున్నాము మేము. తప్పులు మావల్లనే వస్తాయి. వాటిని లెక్క చెయ్యకుండా యేలినవారే మమ్మ క్షమిస్తూ వుండాలి. లేకపోతే మేము నలిగిపోతాము. ఇంతకీ: ఏలినవారిని నేను క్షమించడం యేమిటి రాజాధిరాజా?

రాయడు—అంతా తమకే తెలుసు; కాని గతం మరిచిపొండి. తమ అమ్మాయి గారి దర్శనం కోరుతున్నాము (మళ్లీ చేతులు జోడించుకుని) తమరు అనుగ్రహించాలి.

తిమ్మకవి—ఇవాళ మాకీ పరీక్ష యేమిటో బోధ కావడంలేదు. (మంగకేసిచూస్తూ) అలా వూరుకుంటా వేమే మంగా?

మంగ—జగత్ప్రభువులకు ఒకరి సెలవేమిటి బాబయ్యా? కాకపోయినా, ప్రత్యుత్థానం చేసి తీసుకువెళ్లవలసిన అమ్మాయికి ఇవాళకి ఆరు లంఘనాలు—(అర్ధోక్తి)

రాయడు — (ఆత్రంతో) ఏమన్నావు మంగా?

మంగ—(కళ్లనీళ్లుపెట్టుకొని గద్గదికతో) మాతల్లి ఆరుదినాలనుంచి మంచం దిగడం లేదు మహాప్రభూ!

రాయడు—(చెవులు మూసుకుని) శ్రీ హరీ.........శ్రీహరీ,.........ఎంత అపరాధమూ? (ముందుకి అడుగువేసి) తొరగా నడూ. (నాలుగడుగులువేసి వెనక్కి చూసి) మహాకవీ! తమరుకూడా దయచెయ్యాలి.

తిమ్మకవి—చిత్తం మహాప్రభూ!

(చాలా చురుగ్గా ముందు రాయడూ, అంతకంటే ముందు వెళ్లాలని కంగారుపడుతూ ముందు మంగా, వెనకవిజయానందంతో తిమక్కవీ తిరుమలదేవి నగరికేసి వెళ్లిపోయారు. తియ్యమామిడి గున్నకొమ్మల్లో నక్కివుండీ, గండుకోయిల కుహూకుహూ అంటూ పల్లవి అందుకుంది.)